## క్లుప్తంగా...

### నేడు ఉచిత వైద్య శిబిరం

ఘట్‌కేసర్: చౌదరిగూడ విజయపురి కాలనీలో నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

### వరద సులభంగా వెళ్లేలా చర్యలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో చైర్ పర్సన్ పావనీయాదవ్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో కలిసి 16వ వార్డును పరిశీలించారు. వరద సులభంగా వెళ్లిపోవడానికి ఒక ఫీటు పైప్‌లైన్ వేస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి మరమ్మతులు, వార్డులో సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, రాజేశ్, మారుతి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డప్పుల చప్పుళ్లు, ఆట పాటలతో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

### పూర్వ కమిషనర్ సురేష్‌పై కోర్టు ధిక్కరణ కేసు

పోచారం: ఇటీవల పోచారం మున్సిపాలిటీ నుంచి బదిలీపై వెళ్లిన కమిషనర్ ఎ.సురేష్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. అన్నోజిగూడలోని ఓ ప్రైవేట్ స్థలంపై కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ బాధితుడు హైకోర్టును ఆశ్రయించారు. పూర్వ కమిషనర్ సురేష్‌పై ఈ నెల 13వ తేదీన కోర్టు ధిక్కరణ కేసు ఫైల్ చేయగా 21వ తేదీన రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవధిలో సురేష్ బదిలీ కావడం విశేషం. ఆయనతో పాటు ఇతర ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు విచారణలో ఉంది.

### కలెక్టర్‌ను కలిసిన నాగారం కమిషనర్



కీసర: నాగారం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రకుమార్ శనివారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ అమయ్‌కుమార్‌ను కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అమయ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందంజలో ఉండాలని సూచించారు.

### కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన లక్ష్మీ(22), భర్త మోహన్ ఏడాదిన్నర క్రితం బతుకుదెరువుకు మేడ్చల్ మండలం పూడూరుకు వలస వచ్చారు. గురువారం రాత్రి భార్యాభర్తల గొడవపడ్డారు. దీంతో అదే రోజు రాత్రి గ్రామ పరిధిలోని ఓ నీటి కుంటలో లక్ష్మీ దూకింది. భర్త మోహన్ ఆమె కోసం గాలించినా ఫలితం లభించలేదు. శనివారం నీటి కుంటలో మృతదేహం కనిపించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

### వైన్స్ షాపులో చోరీ

శామీర్‌పేట్: వైన్ షాపులో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామంలోని తిరుమల వైన్స్ షెటర్ శనివారం ఉదయం తెరిచి ఉండటాన్ని ఓ వ్యక్తి గుర్తించి యజమానికి, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేపట్టారు. క్యాష్ కౌంటర్‌లో రూ.15 వేలు, మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు యజమాని పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

### గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జ్ఞానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం గౌడవెల్లి– జ్ఞానాపూర్ రోడ్డులో ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద ఓ వృద్ధుడు మృతిచెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

# అస్తవ్యస్త రోడ్లతో అవస్థలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పలుచోట్ల చకచకా మరమ్మతులు పూర్తి

మేడ్చల్‌రూరల్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. వరద నీటితో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ వైపు ముసురు వాన మరోవైపు గుంతల రోడ్డులో ప్రయాణంతో వాహనదారులు నరకంగా భావిస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలు నీటితో నిండి ఉండటంతో వాటి లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు అందులో పడిపోయే పరిస్థితి నెలకొంది. ఇక మున్సిపాలిటీల్లోని కాలనీలు, గ్రామాల్లోని పలు వీధుల్లో రోడ్లు బురదమయంగా మారడంతో నడిచేందుకు సైతం వీలు లేకుండా మారింది. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో కొంపల్లి వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా మారింది. వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుండటంతో శనివారం స్థానిక కౌన్సిలర్ సరస్వతిమోహన్‌రెడ్డి రోడ్డు మరమ్మతులు చేయించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేయిస్తున్నారు.



పూడూర్- మునీరాబాద్ రోడ్డుపై గుంతలు



కండ్లకోయలో బురదమయంగా మారిన రోడ్డు



గుండ్లపోచంపల్లిలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న కౌన్సిలర్

## గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 3, 20 డివిజన్లలో రోడ్లు గుంతలమయంగా మారడంతో శనివారం మేయర్ మేకల కావ్య, అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపాలని, హనుమాన్ దేవాలయం నుంచి గబ్బిలాల్‌పేటకు వెళ్లే గుంతల రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలని ఆమె అధికారులను ఆదేశించారు. గబ్బిలాల్‌పేటకు వెళ్లాల్సిన బస్సు యధావిధిగా నడపాలని హకీంపేట డిపో మేనేజర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్లి శ్రీనివాస్, సాయికుమార్, మున్సిపల్ డీఈఈ రఘు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





నాగారం మున్సిపల్ పరిధిలోని వరద ముంపు కాలనీల్లో పర్యటిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

## వరద కష్టాలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు..?

- ఏటా వరద ముంచుతున్నా పట్టించుకోని మంత్రి
- ఇటువైపు కన్నెత్తిచూడని సంబంధిత అధికారులు
- సమస్యలను పరిష్కరించుకుంటే ధర్నా చేస్తాం
- టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు కాలనీల్లో శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని బీఎంఆర్, అరవింద్‌నగర్, సాయిసంజీవ, బీబీసీకాలనీ తదితర లోతట్టు కాలనీల్లో పర్యటించారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాల వల్ల వరద కాలనీల్లో చేరడంతో ప్రజల ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో ప్రతి సంవత్సరం వర్షాల కారణంగా వివిధ కాలనీలవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ పాలకులు విఫలం అవుతున్నారని అన్నారు. వరద కష్టాలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరద ముంపు కాలనీవాసులకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా నిలిచి సమస్యకు పరిష్కారం లభించే వరకు పోరాటం చేస్తామన్నారు. త్వరలో కాలనీవాసులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలుస్తామన్నారు. అవసరమైతే అక్కడే కాలనీవాసులతో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పంగ హరిబాబు, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ జయకుమార్, వివిధ కాలనీ అధ్యక్షులు ప్రకాష్, కమలాకర్, రవి, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు సతీష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, పంబాల రమేష్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మె ప్రభుత్వానికి పట్టదా?

– సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్

మేడ్చల్‌రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని తమ ఆరోగ్యంగా భావించి నిత్యం పారిశుద్ధ్య పనులు చేసే అట్టడుగు వర్గాలకు చెందిన కార్మికుల సమ్మె ప్రభుత్వానికి పట్టాదా..? అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ ప్రశ్నించారు. మేడ్చల్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం 17వ రోజు వర్షంలో సమ్మె కొనసాగించారు. సమ్మెలో మద్దతుగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు లేనిదే మనం లేమని కొనియాడిన ప్రభుత్వం ఇప్పుడు 17 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుధాకర్, బాబు, లీలమ్మ, నర్సింహ, రవి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్

## ఘనంగా సీఎంఆర్‌సెట్ గ్రాడ్యుయేషన్ డే



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల మొదటి అటానమస్ గ్రాడ్యుయేషన్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ మజూర్ హుస్సేన్ జూమ్ ద్వారా మాట్లాడారు. విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోవడంతో పాటు 80 శాతం మంది ఉద్యోగాలు సాధించడం అభినందనీయం అన్నారు. అనంతరం సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రసంగించారు. ఉత్తమ విద్యార్థులకు మెడల్స్ అందజేయడంతో పాటు విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజిరెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, కార్యదర్శి వసంతలత, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాబోయ్.. ఇవేం రోడ్లు..?



దమ్మాయిగూడ- నాగారం ప్రధాన రహదారి దుస్థితి

కీసర: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారులు, కాలనీలరహదారులు దెబ్బతిన్నాయి. కీసర–కుషాయిగూడ ప్రధాన రహదారిలో వెంకటసాయి థియేటర్ సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకొని 3 అడుగుల లోతు కోత పడినా ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. కీసరలోని సిద్ధార్థనగర్ కాలనీతో పాటు పలుకాలనీల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దమ్మాయిగూడలోని ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం అయ్యింది. చెరువు కట్ట నుంచి వెంకటేశ్వరనగర్ కాలనీకి వెళ్లే దారి అస్తవ్యస్తంగా మారిపోయింది. నాగారంలోని రాజ్‌సుఖ్‌నగర్, తదితర కాలనీల్లో రోడ్లు బురదమయంగా తయారయ్యాయి. ఇప్పటికైనా స్పందించాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన కీసర- కుషాయిగూడ ప్రధాన రహదారి





దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో వెంకటేశ్వరనగర్ కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి

### కూలిన ఇల్లు త్రుటిలో తప్పిన ప్రమాదం

ఘట్‌కేసర్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఎదులాబాద్‌కు చెందిన నడిమింటి అంజయ్య, నాగమణి దంపతుల ఇల్లు శనివారం కూలిపోయింది. ప్రమాదం గమనించి వారు పక్కకు తప్పుకొని త్రుటిలో ప్రాణాలు కాపాడుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎంపీటీసీ రవితో కలిసి కూలిన ఇంటిని సందర్శించారు. వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటికి అవసరమైన రేకులు అందజేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు.



ఎదులాబాద్‌లో కూలిన అంజయ్య నాగమణి దంపతులు ఇల్లు

### ఎల్ఎన్ కాలనీలో కౌన్సిలర్ పర్యటన

పోచారం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుంటలు నిండి ఇళ్లలోకి నీరు రావడంతో శనివారం ఎల్ఎన్ కాలనీలో కౌన్సిలర్ చింతల రాజశేఖర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగునీటి కాల్వల్లోని చెత్తాచెదారాలను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. జేసీబీతో నీటి తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సూపర్‌వైజర్ నర్సింగ్, సిబ్బంది సంతోష్ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కౌన్సిలర్ చింతల రాజశేఖర్

## పారిశుద్ధ్య కార్మికులకు సంఘీభావం

ఘట్‌కేసర్: సమస్యలు పరిష్కరించాలని 20 రోజులుగా సమ్మె చేపట్టిన పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శనివారం సంఘీభావం తెలిపారు. అవుషాపూర్‌లో ఎంపీపీ స్వయంగా ఇళ్లలోంచి చెత్తను సేకరించారు. అనంతరం చెత్తను సేకరించే వాహనాన్ని నడిపి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, మున్సిపాలిటీ కార్మికులకు ఒక న్యాయం, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు మరో న్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.





అవుషాపూర్‌లో చెత్తను సేకరించే వాహనాన్ని నడుపుతూ..

### బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేదు



మణిపూర్ ఘటనపై నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని నిరసిస్తూ జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్‌లో పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఎండీ.పాషామియా, కార్యదర్శి టి.కాలేషా, సీపీఐ దర్శనం యాదగిరి, రాజేశ్వరి, నాగమణి, నాగేష్, నర్సింహులు, శివనారాయణ, మట్టయ్య, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, మస్తాన్‌బీ, షేక్ మీరా, సావిత్రి, పుణ్యవతి, లక్ష్మణ్, మోయిన్, షేక్ షావలి, మమత, నీలిమ, బాలు, రజిత, జావేద్, యాదగిరి, యూసూఫ్ ఖాద్రీ, వహీద్ తదితరులు ఉన్నారు.



### అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు



ప్రతాపసింగారంలో మాట్లాడుతున్న సర్పంచ్ శిశశంకర్, స్థానికులు

ఘట్‌కేసర్: ఆలయ భూమి విషయంలో అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, నాయకులు తెలుసుకొని మాట్లాడాలని ప్రతాపసింగారం సర్పంచ్ వంగూరి శివశంకర్ అన్నారు. ప్రతాపసింగారంలో శనివారం స్థానికులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సర్కారు భూమిలో ముత్తయ్య అనే వ్యక్తి ఆలయం నిర్మించి, ఇతరులకు సమాచారం ఇవ్వకుండా ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడని, ప్రశ్నిస్తే దౌర్జన్యం అంటున్నాడన్నారు. ఆలయ విషయం పార్టీలకు అంటగట్టడం సరికాదని, మండల నాయకులు నిజనిజాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలని హితవు పలికారు. గ్రామ ఆలయంపై ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే పంచాయతీ పాలకవర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. వార్డు సభ్యులు గోవర్ధన్, సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ స్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోనాలకు అమ్మవారి ఆలయాలు సిద్ధం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించే బోనాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అంబేద్కర్‌నగర్ పోచమ్మ ఆలయం, బాలాజీనగర్‌లోని మూడు ఆలయాలు, అలాగే మహంకాళి, పోచమ్మ ఆలయాలను శనివారం సందర్శించారు. రంగు రంగుల విద్యుత్ దీపాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.



బాలాజీనగర్‌లో విద్యుత్ దీపాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

### సమాజ శ్రేయస్సు కోసం సైకిల్ యాత్ర

కీసర: జల, జంతు, వన సంరక్షణ నినాదంతో కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింగనూరువాసి చాట్రాతి విజయగోపాలకృష్ణ కొన్ని నెలలుగా సైకిల్ యాత్ర చేస్తున్నాడు. శనివారం కీసర మండల కేంద్రానికి చేరుకున్నాడు. కీసరలోని శ్రీరామలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలుదేరి 560 రోజుల్లో 16 రాష్ట్రాలు, అనేక దేవాలయాలు, అడవులు, జంతువులు, నదులను సందర్శించినట్లు తెలిపారు. కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామిని దర్శించుకొని కొమరవెల్లి శ్రీమల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని నగరానికి బయలుదేరతానని తెలిపారు.



### ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

శామీర్‌పేట్: బొమ్మరాశిపేటలో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామంలో మామిడి చిన్న బాలమణి నివాసం ఉంటోంది. ఈ నెల 10న కుత్బుల్లాపూర్‌లో ఉండే తన కూతురు ఇంటికి వెళ్లింది. శనివారం ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని ఫోన్ ద్వారా ఆమెకు సమాచారం అందించారు. అల్మారలోని రూ.15 వేలు, 10 కొత్త చీరలు చోరీకి గురైనట్లు పోలీసులకు సమాచారం అందించింది. శామీర్‌పేట పోలీసులు ఆధారాలు సేకరించారు. గ్రామంలోని సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.